సంపుటి :02 సంచిక :68 పేజీలు :05

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శనివారం 26, ఏప్రిల్ 2025

ఉష్ణోగ్రతలు
కనిష్టం : 27
గరిష్టం : 38

## యువ నేతలను తయారు చేయాలి



- పాతతరం అంతరించి పోతోంది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- హైదరాబాద్ భారత్ సమ్మిట్‌లో కీలక వ్యాఖ్యలు

04

## కాళేశ్వరం ఈఎన్సీ ఇంట్లో ఏసీబీ సోదాలు

- హరిరామ్ నివాసంతోపాటు 14 చోట్ల తనిఖీలు
- ప్రాజెక్టు అనుమతులు, రుణాల్లో ఆయనే కీలకం..
- భారీగా అక్రమాస్తులు గుర్తించినట్లు సమాచారం

05



# ఎరుపెక్కిన కర్రె గుట్టలు !

- తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్
- 38 మంది మావోయిస్టులు హతం ! జవాన్‌కు గాయాలు!
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- అగ్రనేతలే లక్ష్యంగా నాలుగు రోజులుగా ఆపరేషన్
- హెలీక్యాప్టర్లతో బాంబుల వర్షం .. పెద్ద ఎత్తున కూంబింగ్
- యుద్ధం ఆపాలి.. మావోలతో చర్చలు జరపాలి: ప్రొఫెసర్ హరగోపాల్
- హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం

05

తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలు ఎరుపెక్కుతున్నాయి. బాంబుల మోతతో దండకారణ్యం దద్దరిల్లుతోంది. ఈక్రమంలో నే శనివారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో 38 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు సమాచారం. ఎదురుకాల్పుల్లో ఓ జావాన్‌కు గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కర్రెగుట్టల్లో కాల్పుల మోత మోగుతోంది. ఆపరేషన్ కగార్‌లో భాగంగా తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం నివురుగప్పిన నిప్పులా మారింది. అగ్రనేతలే టార్గెట్‌గా భద్రతా బలగాలు చేపట్టిన కూంబింగ్ కీలక దశకు చేరింది. అడవులపై భద్రతా బలగాలు బాంబుల వర్షం కురిపిస్తున్నట్లు సమాచారం. దీంతో పెద్దసంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. దీంతో దండకారణ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో అనే హైటెన్షన్ వాతావరణం నెలకొంది. కానీ, మావోల మృతిపై ఇప్పటివరకు అధికారులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

- అక్షరదర్బార్, ములుగు



# అనితరసాధ్యుడు అప్పయ్య

- హన్మకొండ డీఎంహెచ్‌వో స్ఫూర్తిదాయక ప్రస్థానం
- అతి సాధారణ కుటుంబం నుంచి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిగా..
- సర్కార్ బడుల్లోనే చదువు.. స్కాలర్‌షిప్‌తోనే కొలువు
- పేదల వైద్యుడిగా.. ఆదివాసీల ఆరాధ్యుడిగా ప్రత్యేక గుర్తింపు
- డాక్టర్ అప్పయ్యపై 'అక్షరదర్బార్' ప్రత్యేక కథనం

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సర్వం సిద్ధమైంది. పార్టీ ఏర్పడి పాతికేళ్లు అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని రేపు ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. ఈ సభ కోసం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది జనాలను తరలించేందుకు నేతలు ప్లాన్ చేశారు. మొత్తం 1,213 ఎకరాల్లో ఏర్పాట్లు చేయగా.. 154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం నిర్మించారు. 500 మంది కూర్చునేలా ప్రధాన వేదికను సిద్ధంచేశారు. 1,059 ఎకరాల్లో పార్కింగ్ కు కేటాయించగా.. పార్కింగ్ నిర్వహణకు 2 వేల మంది వలంటీర్లను నియమించారు. సభకు వచ్చే జనం కోసం 10 లక్షల వాటర్ బాటిళ్లు.. 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే కేటీఆర్, కవిత ఎల్కతుర్తిలోని సభా ఏర్పాట్లను పరిశీలించగా.. తాజగా ఇవాళ హరీష్‌రావు సందర్శించి నేతలకు దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి వరంగల్, మెదక్, కరీంనగర్ జిల్లాలకు జంక్షన్‌గా ఉన్న ఎల్కతుర్తి కటౌట్లు, హోర్డింగ్‌లతో ఇప్పటికే గులాబీమయమైంది. ఇక అధినేత కేసీఆర్ ప్రసంగంపైనే ఇప్పుడు అందరి దృష్టినెలకొంది. ప్రతిపక్ష నేతగా సభా వేదిక నుంచి ఆయన చేసే ప్రసంగంపై సర్వత్ర ఆసక్తి నెలకొంది. - అక్షరదర్బార్, వరంగల్

- కేసీఆర్ ప్రసంగంపై సర్వత్ర ఆసక్తి..
- జన సమీకరణపైనే నేతల దృష్టి
- ఇప్పటికే ఏర్పాట్లు పరిశీలించిన కేటీఆర్, హరీష్‌రావు, కవిత
- 1,213 ఎకరాల్లో భారీగా ఏర్పాట్లు.. 1,059 ఎకరాల్లో పార్కింగ్
- 154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం
- 500 మంది కూర్చునేలా ప్రధాన వేదిక
- 10 లక్షల వాటర్ బాటిళ్లు.. 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు
- 1100 మందికిపైగా పోలీసులతో బందోబస్తు..

04

- ఎల్కతుర్తిలో రేపు బీఆర్ఎస్ రజతోత్సవ సభ



# గులాబీ జాతర

అక్షర దర్బార్
శనివారం 26, ఏప్రిల్ 2025
www.aksharadarbar.com



# అనితరసాధ్యుడు
# అప్పయ్య

- హన్మకొండ డీఎంహెచ్‌వో స్ఫూర్తిదాయక ప్రస్థానం
- అతి సాధారణ కుటుంబం నుంచి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిగా..
- సర్కార్ బడుల్లోనే చదువు.. స్కాలర్‌షిప్‌తోనే కొలువు

అత్యంత వెనుకబడిన జాతి నుంచి అత్యున్నత స్థాయికి చేరడం ఆషామాషీ కాదు. అవరోధాలు అధిగమించి, అవకాశాలు అందిపుచ్చుకుంటూ అంచెలంచెలుగా ఎదగడం అందరికీ సాధ్యంకాదు. కానీ ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపారు హన్మకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య. మారుమూల గిరిజన గ్రామంలో పుట్టి పెరిగి, సర్కార్ బడుల్లో చదువుకొని, స్కాలర్‌షిప్‌తోనే ఉన్నత విద్యనభ్యసించారు. ప్రతికూల పరిస్థితుల మధ్యే టెన్త్, ఇంటర్, డిగ్రీలో మెరుగైన ఫలితాలు సాధించారు. లెక్చరర్ కొలువు చేయాలనుకున్న ఆయన తోటి మిత్రుల సలహాతో వైద్య వృత్తి చేపట్టి పేదల వైద్యుడిగా పేరు సంపాదించారు. గిరిజన, ఆదివాసీ ప్రజల హృదయాల్లో ఆరాధ్యుడిగా నిలిచిపోయారు. సమర్థవంతమైన అధికారిగా ప్రజలచే మన్ననలు పొందడమేగాక ప్రభుత్వం నుంచి అవార్డులు, రివార్డులు దక్కించుకున్నారు. హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహ, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ నుంచి భేష్ అప్పయ్య అనిపించుకున్నారు. అంకన్నగూడెం నుంచి హన్మకొండ దాకా సాగించిన స్ఫూర్తిదాయక ప్రస్థానాన్ని అప్పయ్య అక్షరదర్బార్‌తో పంచుకున్నారు. చిన్నతనంలోని కష్టాలను, గతం తాలూకు జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఆయన మాటల్లోనే...

- అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

## అంకన్నగూడెం మా స్వగ్రామం..




ములుగు మండలం అంకన్నగూడెం మా స్వగ్రామం. తల్లిదండ్రులు లక్ష్మీనర్సయ్య - రామక్క. ఆమ్మానాన్నలకు మేం ఆరుగురు సంతానం. భార్య పేరు శకుంతల. ముగ్గురు కుమారులు. ఆకాశ్, పృధ్వీ, త్రిశూల్. అంకన్నగూడెం, జగ్గన్నగూడెం, రాయినిగూడెంలోని ఆశ్రమ పాఠశాలల్లో ప్రాథమిక విద్య, గోవిందరావుపేట జెడ్పీ స్కూల్లో పదోతరగతి పూర్తయింది. హాస్టల్లో ఉండి చదువుకొని టెన్త్‌లో ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యా. భద్రాచలం సమీపంలోని కృష్ణసాగర్‌లో గల ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ కాలేజీలో ఇంటర్ అడ్మిషన్ పొంది 1985-87లో మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించా. 1987లో వరంగల్‌లోని సీకేఎం డిగ్రీ కాలేజీలో బీఎస్సీలో అడ్మిషన్ పొందా. ఫస్ట్ ఇయర్‌లో ఉండగానే ఎంబీబీఎస్ చేయమని సహా విద్యార్థుల సూచన మేరకు ప్రభుత్వ కోచింగ్ సెంటర్లో కోచింగ్ తీసుకొని ఎంసెట్ పరీక్ష రాశా. అప్పట్లో రాష్ట్రంలో 10 మెడికల్ కాలేజీలుండగా అందులో ముఖ్యమైన హైదారాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో చేరా. మ్యూచవల్ షిఫ్టింగ్‌లో భాగంగా వరంగల్‌లోని కేఎంసీలో జాయినై ఇక్కడే 1984లో మెడిసిన్ పూర్తి చేశా. 85లో హౌస్ సర్జన్‌గా చేస్తుండగానే పెళ్లి జరిగింది. హౌస్ సర్జన్‌గా వచ్చే స్టైఫండ్ రూ. 18 వందలతో కుటుంబం గడిచేది. కొన్ని నెలలు ఐటీడీఏలో కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా, కమలాపూర్‌లోని ఏపీ రెయాన్స్‌లో 1998లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశా. 2009లో ఇన్‌సర్వీస్‌లో కేఎంసీలో పీజీ కంప్లీట్ అయింది. 2013లో సీనియర్ సివిల్ సర్జన్‌గా ప్రమోషన్ పొంది సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌గా కొంతకాలం వర్క్ చేశా. 2016లో కొత్త జిల్లాల ఏర్పాటుతో భూపాలపల్లి, 2019లో నూతనంగా ఏర్పడిన ములుగు జిల్లాలో డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టా. 2021లో సివిల్ సర్జన్‌గా ప్రమోషన్ దక్కింది.

- పేదల వైద్యుడిగా.. ఆదివాసీల ఆరాధ్యుడిగా ప్రత్యేక గుర్తింపు
- ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక ఎక్సలెన్స్ అవార్డు
- పెనుగోలులో వైద్య సేవలకు ప్రశంసలు
- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర, హర్యానా గవర్నర్ దత్తాత్రేయ నుంచి అభినందనలు
- వరుసగా మేడారం జాతరల్లో కీలక భూమిక
- లెక్చరర్ కావాలనుకొని వైద్యుడైన అల్లెం..
- డాక్టర్ అప్పయ్యపై 'అక్షరదర్బార్' ప్రత్యేక కథనం

## ఎప్పటికీ మరువలేను..

గురువుల ప్రోత్సాహంతో లెక్చరర్ అవుదామనుకున్నప్పటికీ అనుకోకుండా డాక్టర్ వృత్తిలో స్థిరపడ్డా. చిన్నప్పటి నుంచి ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో ముందుండటంతో గోవిందరావుపేటలో ఇంటర్ చదివే రోజుల్లో మా లెక్చరర్ నన్ను ఇంగ్లిష్ లెక్చరర్ కావాలని ప్రోత్సహించారు. భూపాలపల్లి, ములుగు డీఎంహెచ్‌వోగా సమర్థవంతంగా బాధ్యతలు చేపట్టా. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు పెంచినందుకు ప్రభుత్వం నుంచి 2017లో ఎక్సలెన్స్ అవార్డు పొందడం మరిచిపోలేనిది. హాస్టల్ నిద్రలు, ప్రభుత్వ పాఠశాలల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాం. మలేరియా కేసులు తగ్గించడం, ప్రసవాల సంఖ్య పెంచడంలో 2023-24లో ములుగు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం సంతృప్తినిచ్చింది. అదేవిధంగా భూపాలపల్లి, ములుగు డీఎంహెచ్‌వోగా దేశంలోనే ప్రముఖ ఆదివాసీ గిరిజన జాతరైన మేడారం సమ్మక్క-సారక్క జాతరలో వరుసగా 2018, 2020, 2022, 2024 నాలుగుసార్లు విధులు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నా. హన్మకొండ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించడం, ప్రభుత్వ సహకారంతో ప్రజలకు సర్కార్ వైద్యాన్ని మరింత దగ్గర చేసేందుకు నిరంతం కృషి చేస్తున్నాం.

## ప్రాణాలకు తెగించి పొనుగోలు పోయినం..

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి. మరీ ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో నివాసముండే గిరిజన ప్రజలు ఈ వ్యాధుల బారిన ఎక్కువగా పడుతుంటారు. ఇలా ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు గ్రామంలో గుట్టపై ఉన్న 15 కుటుంబాల కోసం వైద్యశిబిరం ఏర్పాటు చేశాం. సిబ్బందితో కలిసి పెనుగోలు బయలుదేరాం. కానీ ఆ గ్రామానికి సరైన రోడ్డుమార్గం లేదు. భారీ వర్షాల కారణంగా గ్రామాన్ని వాగులు, వంకలు చుట్టుముట్టాయి. ఇక గ్రామానికి వెళ్లడం అసాధ్యమని వెనుదిరిగేందుకు సిద్ధమయ్యాం. కానీ మనసు మాత్రం అందుకు అంగీకరించలేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెనుగోలుకు వెళ్లి గిరిజన బిడ్డలకు వైద్యసాయం అందించాలని నిశ్చయించుకున్నా. అనుకున్నదే తడవుగా నడక కొనసాగించాం. ప్రయాణం అసాధ్యమనుకున్న గిరిజన గ్రామానికి ప్రమాదకరమైన 4 వాగులు, 5 గుట్టలను దాటుకుంటూ వెళ్లాం. దాదాపు 16 కిలోమీటర్లు నరకప్రాయమైన మార్గంలో ప్రయాణించాం. జోరువానలోనే పెనుగోలుకు 2024 జూలై 16, 17 వైద్య బృందం చేరుకున్నాం. రాత్రి ఆ గిరిజన గ్రామంలోనే బస చేసి మర్నాడు గ్రామస్తులకు వైద్యసేవల అందించాం. దోమతెరలు, మందులు అందించి వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు సూచించాం. ఇది జీవితంలో మరిచిలేని అనుభూతి. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫోటోలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి అభినందించడం మధురానుభూతి.









# కోమటిపల్లి బీటీ రోడ్డు పనులను పూర్తి చేయాలి

**- కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి**

**- సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజు**




అక్షర దర్బార్, ఇనుగుర్తి: ప్రజల సౌకర్యార్థం లక్షల నిధులు వెచ్చించి వేసిన ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామం నుండి చీన్యాతండా క్రాస్ రోడ్డు వరకు అసంపూర్తిగా వేసిన బీటీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజు డిమాండ్ చేశారు. బీటీ రోడ్డు పనులు పూర్తి చేయకుండా తూతూమంత్రంగా చేసి వదిలేశారని, దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందికరంగా ఉందని అన్నారు. రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్ పై ఆర్అండ్ బీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ వెంటనే బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు.

# పహెల్గాం మృతులకు జర్నలిస్టుల నివాళి



అక్షర దర్బార్, కేసముద్రం : కశ్మీర్ లోని పహెల్గంలో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కేసముద్రం మున్సిపల్ కేంద్రంలో జర్నలిస్టుల ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై మురళీధర్ రాజ్ మాట్లాడుతూ... అమాయకులపై ఉగ్రదాడి హేయమైన చర్య అని పేర్కొన్నారు. జర్నలిస్టు సత్యనారాయణ మాట్లాడుతూ.. పర్యాటకుల బృందాన్ని లక్ష్యంగా చేసుకొని జరిగిన ఉగ్రవాద దాడి దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. కార్యక్రమంలో వేల్పుల రాజు యాదవ్, జర్నలిస్టులు గాజుల రవి, పి.రవిచంద్ర, శీలం దామోదర్, వేల్పుల రేవంత్, గంధసిరి యాకన్న, సోమారపు శ్రీరాములు, జన్ను శ్రీనివాస్, మిట్ట గడుపుల మహేందర్, చంద్రగిరి వంశీకృష్ణ పాల్గొన్నారు.






# సర్వం సిద్ధం

- ఎల్కతుర్తిలో రేపు బీఆర్ఎస్ రజతోత్సవ సభ
- కేసీఆర్ ప్రసంగంపై సర్వత్ర ఆసక్తి..
- జన సమీకరణపైనే నేతల దృష్టి
- ఇప్పటికే ఏర్పాట్లు పరిశీలించిన కేటీఆర్, హరీష్‌రావు, కవిత
- 1,213 ఎకరాల్లో భారీగా ఏర్పాట్లు..

**1,059 ఎకరాల్లో పార్కింగ్**

- 154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం
- 500 మంది కూర్చునేలా ప్రధాన వేదిక
- 10 లక్షల వాటర్ బాటిళ్లు.. 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు
- 1100 మందికిపైగా పోలీసులతో బందోబస్తు..

అక్షరదర్బార్, వరంగల్: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సర్వం సిద్ధమైంది. పార్టీ ఏర్పడి పాతికేళ్లు అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని రేపు ఎల్కతుర్తిలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నారు. ఈ సభ కోసం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది జనాలను తరలించేందుకు నేతలు ప్లాన్ చేశారు.

### 1,213 ఎకరాల్లో ఏర్పాట్లు

మొత్తం 1,213 ఎకరాల్లో ఏర్పాట్లు చేయగా, 154 ఎకరాల్లో మహాసభ ప్రాంగణం నిర్మించారు. 500 మంది కూర్చునేలా ప్రధాన వేదికను సిద్ధంచేశారు. 1,059 ఎకరాల్లో పార్కింగ్ కు కేటాయించగా.. పార్కింగ్ నిర్వహణకు 2 వేల మంది వలంటీర్లను నియమించారు. సభకు వచ్చే జనం కోసం 10 లక్షల వాటర్ బాటిళ్లు.. 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే కేటీఆర్, కవిత ఎల్కతుర్తిలోని సభా ఏర్పాట్లను పరిశీలించగా.. తాజగా ఇవాళ హరీష్‌రావు సందర్శించి నేతలకు దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి వరంగల్, మెదక్, కరీంనగర్ జిల్లాలకు జంక్షన్‌గా ఉన్న ఎల్కతుర్తి కటౌట్లు, హోర్డింగ్‌లతో ఇప్పటికే గులాబీమయమైంది. ఇక అధినేత కేసీఆర్ ప్రసంగంపైనే ఇప్పుడు అందరి దృష్టినెలకొంది. ప్రతిపక్ష నేతగా సభా వేదిక నుంచి ఆయన చేసే ప్రసంగంపై సర్వత్ర ఆసక్తి నెలకొంది.

### భారీగా పోలీస్ బందోబస్త్

ఎల్కతుర్తిలో రేపు నిర్వహించబోయే బీఆర్ఎస్ రజతోత్సవ మహా సభకు భారీగా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. 1100 మందికిపైగా పోలీసులు విధులు నిర్వహించనున్నారు. ఇందులో ఇద్దరు డీసీపీలు, ఇద్దరు అదనపు డీసీపీలు, 8 మంది ఏసీపీలు, 28 మంది ఇన్స్ స్పెక్టర్లు /ఆర్. ఐలు, 66 ఎస్సైలు, 137 ఏ. ఎస్. ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు , 511 మంది కానిస్టేబుళ్ళు , 200 హోంగార్డ్స్ తోపాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

# ఫార్మాసిస్టులు ఇక ఫార్మసీ ఆఫీసర్స్

**- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ**

అక్షరదర్బార్, హనుమకొండ: వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఫార్మసిస్టుల హోదాను ఫార్మసీ ఆఫీసర్స్ గా మార్చుతూ ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శుక్రవారం జీవో జారీ చేశారు. వైద్య, విద్య, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, వైద్య విధాన పరిషత్ లో పనిచేస్తున్న ఫార్మసిస్ట్ గ్రేడ్- 2 లను ఫార్మసి ఆఫీసర్స్ గా, ఫార్మసిస్ట్ గ్రేడ్-1లను సీనియర్ ఫార్మసి ఆఫీసర్స్ గా, ఫార్మసీ సూపర్వైజర్ లను చీఫ్ ఫార్మసి ఆఫీసర్లుగా మార్పు చేస్తూ జీవో జారీ విడుదల చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఫార్మసిస్టుల హోదాను తెలంగాణ ప్రభుత్వం ఫార్మసీ ఆఫీసర్స్ గా మార్చడం పట్ల ఫార్మసిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్, రాష్ట్ర ఫార్మసి కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర నాయకుడు ఉప్పు భాస్కర్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె శరత్ బాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి : సీఐ మల్లేష్

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైం: భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం జరగబోయే జాబ్ మేళాను చిట్యాల సర్కిల్ పరిధిలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని చిట్యాల సీఐ మల్లేష్ తెలిపారు. శనివారం ఆయన అక్షర దర్బార్ తో మాట్లాడుతూ.. చిట్యాల సర్కిల్ పరిధిలోని నిరుద్యోగ యువకులు 5వేల మంది ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, చిట్యాల సర్కిల్ పరిధిలో పోలీస్ శాఖ నుండి 500 ప్రైవేట్ వాహనాలను నిరుద్యోగ యువత సౌకర్యార్థం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

# రైతులకు న్యాయం చేస్తా

**- భూపాలపల్లి ఆర్డీవో రవి**

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : మొగుళ్ళ పల్లి మండల కేంద్రంలో శనివారం నేషనల్ హైవే రోడ్డు సర్వేను రైతులు అడ్డుకున్నారు. దీంతో విషయం తెలుసుకున్న వెంటనే ఆర్డీవో రవి ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అయితే బాధిత రైతులు సోమవారం కలెక్టర్ ను కలిసిన అభిప్రాయం చెపుతామని ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మొగుళ్లపల్లి తహశీల్దార్ జె సునీత మొగుళ్లపల్లి ఎస్సై అశోక్, గిర్దావర్ ఆర్ శివరామ కృష్ణ పాల్గొనారు.



# యువ నాయకులను తయారు చేయాలి

- పాతతరం అంతరించి పోతోంది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- హైదరాబాద్ భారత్ సమ్మిట్‌లో కీలక వ్యాఖ్యలు




అక్షరదర్బార్, హైదరాబాద్: పదేళ్లలో ప్రపంచ రాజకీయాలు ఎంతో మారిపోయాయని, గతానికి, ఇప్పటికీ ఎంతో తేడా ఉందని, పాతతరం నాయకత్వం అంతరించిపోయిందని, రాజకీయాల్లోకి కొత్త తరం రావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆధునిక సామాజిక మాధ్యమాలతో అంతా మారిపోయిందని తెలిపారు. దేశ సమస్యలు తెలుసుకునేందుకు కన్యాకుమారి నుంచి సుమారు 4 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశానన్నారు. పాదయాత్ర మొదలు పెట్టక ముందు ఆలోచించాను.. మొదలుపెట్టాక వెనకడుగు వేయలేదని వివరించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో జనం సమస్యలు వినటం నేర్చుకున్నానని, ఇప్పుడు వారి సమస్యలు వినటంలో నాయకులు విఫలమయ్యారని రాహుల్ గాంధీ వివరించారు.

### అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యం : సీఎం రేవంత్

గత పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వంపై ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు అనేక పథకాలు తీసుకొచ్చామన్నారు. దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. రైతులకు సుమారు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేశామని వివరించారు. రైతులకు 24 గంటలూ ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. రైతు భరోసా కింద రైతులకు ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నామని, వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నామని ఆయన వెల్లడించారు.

## స్వేరోస్ జిల్లా కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా మహేందర్



అక్షర దర్బార్,తొర్రూరు : స్వేరోస్ ఇంటర్నేషనల్ మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీని శనివారం తొర్రూరు పట్టణ కేంద్రంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వేరోస్ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు మారపెల్లి మనోజ్ స్వేరో, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ శనిగరం శ్రీనివాస్ స్వేరో మాట్లాడుతూ.. స్వేరో ఇంటర్నేషనల్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఒక గొప్ప ఆలోచనతో అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే నినాదంతో స్వేరోస్ ఇంటర్నేషనల్ ప్రారంభించారని తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా బాషపంగు మహేందర్ స్వేరో, ఉపాధ్యక్షులుగా నెమ్మది రమేష్ స్వేరో, మంగళపెల్లి త్యాగరాజు స్వేరో, ప్రధాన కార్యదర్శిగా చిర్రా సతీష్ గౌడ్ స్వేరో, అధికార ప్రతినిధిగా వేల్పుల నాగరాజు స్వేరో, కోశాధికారిగా పుల్లూరి ప్రశాంత్ స్వేరో, జాయింట్ సెక్రెటరీగా దాసరి సతీష్ స్వేరో, బొల్లికొండ రాజకుమార్ స్వేరో ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బాషపంగు మహేందర్ స్వేరో మాట్లాడుతూ.. తమ ఎన్నికకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్వేరోస్ ఇంటర్నేషనల్ సీనియర్ నాయకులు వేల్పుల ఐలన్న స్వేరో, దర్శనాల ఉమేష్ స్వేరో, జింక లక్ష్మణ్ స్వేరో, ఇంద్ల వెంకటేశ్వర్లు స్వేరో, తదితరులు పాల్గొన్నారు.

## కనీవినీ ఎరుగుని రీతిలో బీఆర్ఎస్ సభ

### మాజీ మున్సిపల్ కో ఆప్షన్ ఫాతిమా హమీద్



అక్షర దర్బార్, పరకాల : దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఈనెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో జరుగుతుందని మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ముఫీనా ఫాతిమా హమీద్ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం ఆవిర్భవించి ఉద్యమ పంథాతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉంచిందని, ఉద్యమ సింహం కేసీఆర్ ఏం మాట్లాడుతారో, ప్రజలకు ఎలాంటి భరోసా కల్పిస్తారో అని 4 కోట్ల మంది రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారని పేర్కొన్నారు.





## టూరిస్టులపై ఉగ్రదాడి హేయమైన చర్య

- ఎన్ హెచ్ ఆర్సీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్

అక్షర దర్బార్, మల్హర్ : జమ్మూ కశ్మీర్ పహెల్గాంలో టూరిస్టులపై ఉగ్రదాడి హేయమైన చర్య అని భూపాలపల్లి జిల్లా హెన్ హెచ్ ఆర్సీ ఉపాధ్యక్షులు ముడితనపెల్లి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తాడిచెర్లలో ఎన్ హెచ్ ఆర్సీ మండల అధ్యక్షుడు చింతల కుమార్ యాదవ్ అధ్యక్షత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమాయకుల ప్రాణాలు తీయడం పిరికి పందల చర్య అని అన్నారు. మృతి చెందిన 30 మంది అమాయక ప్రజల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎన్ హెచ్ ఆర్సీ సభ్యుడు చొప్పరి రాజయ్య పాల్గొన్నారు.



## కరెంట్ షాక్ తో ఎద్దు మృతి

అక్షర దర్బార్, మల్హర్ : ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మండలంలోని పెద్ద తూండ్ల గ్రామపంచాయతీ పరిధిలోని గాదంపల్లి గ్రామానికి చెందిన నల్లాల బుచ్చయ్య అనే రైతుకు చెందిన దుక్కిటెద్దు మృతి చెందింది. బాధిత రైతు కథనం ప్రకారం.. తన వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం ఎద్దులు మేత మేస్తున్న క్రమంలో విద్యుత్ వైర్ తగిలి కరెంట్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లుగా రైతు కన్నీరుమున్నీరయ్యాడు. రూ.70 విలువ చేసే ఎద్దు మృతితో వ్యవసాయం మూలన పడిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం, విద్యుత్ శాఖ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

## రజతోత్సవ సభ కాదు..

# అనైతిక సభ..

- కేసీఆర్ ది అబద్ధాల చరిత్ర
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

అక్షర దర్బార్, పరకాల : రజతోత్సవ సభ కాదు, అనైతిక సభ అని తెలంగాణ రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయడానికే కేసీఆర్ ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి విమర్శించారు. శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఏం చేసారో చెప్పి రేపు ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ సభను జరుపుకోవాలని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ నిర్వహించేది రజతోత్సవ సభ కాదు అనైతిక సభ అని, కేసీఆర్ చరిత్ర అబద్ధాల చరిత్ర అని అన్నారు. కేసీఆర్ ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడం, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు, జీవితాలతో ఆడుకుంటున్నాడని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తామని ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి

అక్షర దర్బార్, నెక్కొండ : దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉండేందుకే గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, రామాలయం చైర్మన్ సుధాకర్ రెడ్డి,మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, మార్కెట్ కార్యదర్శి కృష్ణమీనాన్ రావు, ఏఈ ఓ వసంత, సిసి రవీందర్ సునీత , సతీష్ కుమార్ సభ్యులు సమత, సరిత పాల్గొన్నారు.



## 'ఇందిరమ్మ' లబ్ధిదారులను ఎంపిక చేయండి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఖానాపూర్, నర్సంపేటలో సర్వే పరిశీలన



అక్షర దర్బార్,నర్సంపేట : ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం నర్సంపేట పరిధిలో, ఖానాపూర్ మండల కేంద్రంలో రెండో దఫా గృహాల కోసం లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధల మేరకు అర్హుల గుర్తింపు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంగా జరగాలని అన్నారు. ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే మంజూరు జాబితా నుంచి తొలగించాలని అధికారులకు సూచించారు. ఈనెల 30 వరకు అర్హతల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. గతంలో బేస్మెంట్, పిల్లర్స్ కట్టిన వారు అర్హులుకారనే విషయాన్ని గుర్తించాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపికైనవారు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి ప్రొసీడింగ్స్ అందిన తర్వాతే నూతన ఇండ్ల నిర్మాణానికి ముగ్గులు పోసుకుని ప్రారంభించాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, హౌసింగ్ ప్రాజెక్ట్ అధికారి గణపతి, నర్సంపేట మునిసిపల్ కమిషనర్ జోనా తదితరులు పాల్గొన్నారు.

### అంగన్ వాడీ కేంద్రాల్లో తనిఖీ

అక్షర దర్బార్, ఖానాపురం: నర్సంపేట మండలంలోని కమలాపురం, దాసరిపల్లి, ఖానాపురం మండలంలోని అంగన్వాడీ సెంటర్లను వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మత్తు పనులను పరిశీలించారు. అంగన్వాడీ టీచర్లకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. కలెక్టర్ వెంట జడ్పీ సీఈఓ రాంరెడ్డి, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, జిల్లా సంక్షేమ అధికారిణి రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గిట్టుబాటు ధర

### డీసీసీ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్ రావు

అక్షర దర్బార్, ఖానాపూర్ : ఆరుకాలం కష్టించి పంట పండించిన రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గిట్టుబాటు ధర అందుతోందని డీసీసీ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. శనివారం ఖానాపురం మండలం అయోధ్య నగర్, అశోక్ నగర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రవీందర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు క్వింటాళ్ కు రూ.2320 గిట్టుబాటు ధరను చెల్లిస్తోందని, సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. కార్యక్రమంలో అశోకనగర్ గ్రామ పార్టీ అధ్యక్షులు ఎల్తి శ్రీనివాస్ గౌడ్ ఏఎంసి డైరెక్టర్ ,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టి సారంగపాణి,అయోధ్య నగర్ గ్రామ పార్టీ అధ్యక్షులు గుండ్ల యాకన్న, సొసైటీ డైరెక్టర్ జాడి అచ్యుత్, మాజీ వార్డ్ మెంబర్ పానుగోటి ప్రవీణ్ రావు, బీసీ సెల్ అధ్యక్షులు కాదురు సారయ్య ,కదులు సమ్మయ్య, బొంపల్లి అనిల్ రావు పెండ్లి కొంతం రాజు, సీనియర్ నాయకులు ఇరుకు ప్రభాకర్ రావు, ఇరుకు సాగర్ రావు ఎస్సీ సెల్ అధ్యక్షులు జాడి వెంకటేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కుస మునీందర్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దొడ్డ మురళి, గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బండి సంజీవ, బుర్ర మురళి, బానోత్ మల్లేష్, బానోతు విజయ్ అలవాల పాల్గొన్నారు.



# షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

- ఇద్దరు వృద్ధులను కాపాడిన గ్రామస్తులు
- అందుకుతండాలో ఘటన



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం అద్దంట గ్రామంలో శుక్రవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ తో మురహరి రాజయ్యకు చెందిన ఇల్లు దగ్ధమైంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామ పరిధిలోని అందుకుతండా గ్రామంలో మురహరి రాజయ్య అనే వ్యక్తి పక్షవాతంతో గత పదేళ్లుగా మంచానికి పరిమితమై ఇంట్లోనే ఉంటున్నాడు. అతడి భార్య సైతం అనారోగ్యంతోనే ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ తో వారి ఇంటికి నిప్పంటుకుంది. గమనించిన స్థానికులు హుటాహుటిన వృద్ధ దంపతులను బయ టికి తీసుకువచ్చి కాపాడారు. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో రోడ్డున పడిన బాధితులను ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కాళేశ్వరం ఈఎన్సీ ఇంట్లో ఏసీబీ సోదాలు

- హరిరామ్ నివాసంతోపాటు 14 చోట్ల తనిఖీలు
- ప్రాజెక్టు అనుమతులు, రుణాల్లో ఆయనే కీలకం..
- భారీగా అక్రమాస్తులు గుర్తించినట్లు సమాచారం

అక్షరదర్బార్, హైదరాబాద్ : కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. హైదరాబాద్ నగరంలోని షేక్‌పేట ఆదిత్య టవర్స్‌లోని ఆయన నివాసంలో తెల్లవారుజాము నుంచి అధికారులు తనిఖీలు చేశారు. హరిరామ్ కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీగా ఉన్నారు. గజ్వేల్ ప్రాంత ఈఎన్సీగా పని చేస్తున్నారు. కాళేశ్వరం అనుమతులు, రుణాల్లో హరిరామ్ కీలకంగా వ్యవహరించారు. హరిరామ్ భార్య అనిత నీటి పారుదలశాఖలో డిప్యూటీ ఈఎన్సీగా ఉన్నారు. ప్రస్తుతం అనిత వాలంతరి డైరెక్టర్ జనరల్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఏప్రిల్ 26న ఉదయం నుంచే ఎన్డీఎస్ఏ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా ఏసీబీ అధికారులు మెరుపు దాడులకు దిగారు. హరిరామ్ నివాసంతో పాటు మొత్తం 14 చోట్ల సోదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతులు, రుణాల్లో కీలకంగా వ్యవహరించిన హరి రామ్ నివాసంలో ఏసీబీ దాడులు కలకలంరేపాయి. సోదాల్లో భాగంగా హరిరామ్ పేరిట భారీగా ఆస్తులు ఉన్నట్లుగా ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం.





# ఎరుపెక్కిన కర్రెగుట్టలు !

- తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్
- 38 మంది మావోయిస్టులు హతం ! జవాన్‌కు గాయాలు!
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- అగ్రనేతలే లక్ష్యంగా నాలుగు రోజులుగా ఆపరేషన్
- హెలీకాప్టర్లతో బాంబుల వర్షం ..
- యుద్ధం ఆపాలి.. మావోలతో చర్చలు జరపాలి: ప్రొఫెసర్ హరగోపాల్
- హన్మకొండ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం

అక్షరదర్బార్, ములుగు: తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలు ఎరుపెక్కుతున్నాయి. బాంబుల మోతతో దండకారణ్యం దద్దరిల్లుతోంది. ఈక్రమంలోనే శనివారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో 38 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు సమాచారం. ఎదురుకాల్పుల్లో ఓ జావాన్‌కు గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కర్రెగుట్టల్లో కాల్పుల మోత మోగుతోంది. ఆపరేషన్ కగార్‌లో భాగంగా తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం నివురుగప్పిన నిప్పులా మారింది. అగ్రనేతలే టార్గెట్‌గా భద్రతా బలగాలు చేపట్టిన కూంబింగ్ కీలక దశకు చేరింది. అడవులపై భద్రతా బలగాలు బాంబుల వర్షం కురిపిస్తున్నట్లు సమాచారం. దీంతో పెద్దసంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. దీంతో దండకారణ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందో అనే హైటెన్షన్ వాతావరణం నెలకొంది. కానీ, మావోల మృతిపై ఇప్పటివరకు అధికారులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

**- కీలక దశకు కూంబింగ్**

మావోయిస్టు పార్టీ నిర్మూలనే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌తో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అంతా వార్‌జోన్‌గా మారింది. అగ్రనేతలే టార్గెట్‌గా సాగుతున్న ఆపరేషన్ కర్రెగుట్టల్లో నాలుగు రోజులుగా పెద్ద ఎత్తున కూంబింగ్ కొనసాగుతోంది. పెద్ద ఎత్తున మావోయిస్టులు హతమయ్యే అవకాశం ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఇక మావోయిస్టులకు పెట్టని కోటలాగా ఉన్న కర్రెగుట్టల చుట్టూ దాదాపు పదివేల మంది భద్రతా బలగాలు మోహరించి ఉన్నట్లు సమాచారం. కర్రెగుట్టల్లో మావోయిస్టు సుప్రీం కమాండర్ హిడ్మాతో పాటు వేలాది మంది మావోయిస్టులు ఉన్నట్లు భద్రతాబలగాలు గుర్తించాయి. వారి లక్ష్యంగానే కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. ములుగు జిల్లా సరిహద్దు నుంచి ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా వరకు అలాగే మహారాష్ట్రలో గడ్చిరోలి ప్రాంతంలో ఉన్న నదుల నుంచి మావోయిస్టులు తప్పించుకోకుండా మూడు వైపుల నుంచి భద్రతా బలగాలు చుట్టుముట్టినట్లు సమాచారం. అధునాతన ఆయుధాలు, హెలీకాప్టర్లు, శాటిలైట్స్, డ్రోన్స్‌ను ఉపయోగిస్తూ మావోయిస్టులపై నుంచి బాంబుల వర్షం కురిపిస్తున్నట్లు తెలుస్తోంది.

**- అగ్రనేతలే టార్గెట్**

కాగా.. కర్రెగుట్టల్లో జరుగుతున్న భీకర కాల్పులపై ప్రజాస్వామ్యవాదులు, పౌరహక్కుల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కర్రెగుట్టల నుంచి భద్రతాబలగాలు వెనక్కి తగ్గాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా శాంతి చర్చలు జరపాలంటూ భారత్ బచావో పేరుతో ఓ లేఖను కూడా విడుదల చేశారు. అలాగే మావోయిస్టుల కేంద్ర కమిటీ కూడా పలుమార్లు లేఖలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. చర్చలకు తాము సిద్ధమంటూ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ నుంచి కిందిస్థాయి దళాల వరకు వినతి చేసినా అటు కేంద్ర ప్రభుత్వం కానీ, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కానీ స్పందించని పరిస్థితి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలకు బాటలు వేయాలని తెలంగాణ పౌరహక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## కర్రెగుట్టల్లో కూంబింగ్ ఆపాలి

పౌర హక్కుల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో ప్రొఫెసర్ హరగోపాల్ మీడియా సమావేశం నిర్వహించారు. ఛత్తీస్‌గఢ్ - తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలో కాల్పులను కేంద్ర ప్రభుత్వం నిలిపి వేయాలని, మధ్య భారతంలో ఆదివాసీల హననాన్ని ఆపాలని కోరారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగం అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలన్నారు. దేశంలో శాంతియుత వాతావరణం. ఏర్పాటుకు కేంద్రం చర్చలు ప్రారంభించాలన్నారు. విప్లవ పార్టీలు, ప్రభుత్వాల మధ్య చర్చలు జరిగితే అందరికీ ఉపయోగకరం అన్నారు. మావోయిస్టు పార్టీ, కేంద్రం మధ్య జరుగుతున్న పోరాటంలో అమాయక ఆదివాసీలు బలి అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. స్మశానంలో చర్చలు జరపాలని




కేంద్రం అనుకుంటున్నదని, మావోయిస్టు పార్టీ లేఖలు రాసినప్పటికీ కర్రెగుట్టను వేలాది మందితో ముట్టడించడం సరికాదన్నారు. యుద్ధం అపాలని... సమాజం కోరిక మేరకు కేంద్రం ముందుకు రావాలని హరగోపాల్ కోరారు.

# రేపటిలోగా వెళ్లిపోండి

- హైదరాబాద్‌లోని నలుగురు పాక్ పౌరులకు పోలీసుల నోటీసులు
- రాజధానిలో మొత్తం 213 మంది పాకిస్థానీల గుర్తింపు

అక్షరదర్బార్, హైదరాబాద్: హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ వీసాలతో ఉంటున్న నలుగురు పాకిస్తానీలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. రేపటిలోగా హైదరాబాద్ విడిచి వెళ్లాలని హెచ్చరించారు. కేంద్ర హోం శాఖ ఆదేశాలతో తనిఖీలు నిర్వహించిన పోలీసులు ఈ మేరకు నోటీసులు ఇచ్చారు. పహల్గామ్‌లో టెర్రరిస్టుల దాడి నేపథ్యంలో వివిధ వీసాలతో భారత్‌లో ఉంటున్న పాకిస్థానీయులను పంపించేయాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈనేపథ్యంలో కేంద్ర హోంశాఖ ఆదేశాలతో పలు రాష్ట్రాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో హైదరాబాద్‌లో మొత్తం 213 మంది పాకిస్థాన్ దేశస్తులు ఉన్నారని గుర్తించారు. వారిలో నలుగురు షార్ట్ టర్మ్ వీసాలతో ఉన్న వారికి ఇవాళ హైదరాబాద్ పోలీసులు నోటీసులు ఇచ్చారు.

# వడదెబ్బ తో వ్యక్తి మృతి



అక్షర దర్బార్ మొగుళ్లపల్లి. మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన మిరుపురి రాజయ్య అనే వ్యక్తి శనివారం వడదెబ్బతో మృతి చెందినట్లు మృతుడి కుమారుడు మిరుపురి కిరణ్ తెలిపారు శనివారం మధ్యాహ్నం ఎండవేడికి తట్టుకోలేక రోడ్డుమీద మృతిచెందినట్లు విలపిస్తూ తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజయ్య మృతితో రోడ్డునపడిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# ఆపదలో ఆసరాగా మాజీ కౌన్సిలర్ పూర్ణ చారి

**కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు..**



అక్షర దర్బార్, పరకాల : పరకాల మున్సిపాలిటీ 9వ వార్డులో నిరు పేద కుటుంబానికి చెందిన గుమలాపురం సారయ్య అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న స్థానిక 9 వ వార్డు తాజా, మాజీ కౌన్సిలర్, బిజెపి ఓబీసీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి పూర్ణ చారి శనివారం వారి ఇంటికి వెళ్లి 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులతో పాటు ఆర్థిక సహాయం చేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన వార్డు ప్రజలు కష్టాల్లో ఉంటే వెంటనే ఆదుకునే ఆపద్బాంధవుడు 9వ వార్డు కౌన్సిలర్ పూర్ణ చారి అని కాలనీవాసులు అభినందించారు. కార్యక్రమంలో సారయ్య భార్య గుమలాపురం, వీరాస్వామి, రవితేజ కడారి నాని, లక్ష్మి, ఈశ్వరమ్మ, రాజేశ్వరి, సీత, వార్డు ప్రముఖులు మార్త బిక్షపతి, దార్న నారాయణదాసు, దాసరి వెంకన్న, సంఘ నరేష్, బూర వెంకటేశ్వర్లు, వావిలాల రాజయ్య, సామల బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278 ★ RNI NO. TELTEL/2022/81915